# కళ తప్పిన పల్లె ప్రకృతి వనాలు

- లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేశారు
- తిరిగి నాటని మొక్కలు
- కరువైన ఆహ్లాదం
- పట్టించుకోని అధికారులు


నార్నూర్: మాహగావ్‌లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలో ఎండిపోతున్న మొక్కలు

నార్నూర్, ఫిబ్రవరి 26 : ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చదనాన్ని కల్పించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లెల్లో ప్రకృతి వనాలు ఏర్పాటు చేసింది. వాటి నిర్మాణానికి లక్షల రూపాయలు ఖర్చు చేసింది. మొక్కలు నాటి సంరక్షణ చర్యలు తీసుకున్నది. కానీ నేడు క్షేత్రస్థాయిలో పల్లె ప్రకృతి వనాల పరిస్థితి అధ్వానంగా కనిపిస్తోంది. సరైన నిర్వహణ, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రకృతి వనాలు నేడు ఎడారిల తలపిస్తున్నాయి. మొక్కలు దెబ్బతినకుండా కంచెలు, బోర్డులు ఏర్పాటు చేశారు తప్ప ఆ మొక్కలను సంరక్షించాలంటే నీరు మాత్రం పోయాలన్న విషయాన్ని మర్చిపోయారు. కనీసం ఎండిపోయిన మొక్కల స్థానంలో వేరే మొక్కలు నాటకపోవడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆదిలాబాద్ జిల్లా నార్నూర్, గాదిగూడ మండలాల పరిధిలో48 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో 48 పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. రూ.లక్షలు పెట్టి వనాలను ఏర్పాటు చేసినప్పటికీ అధికారులు వీటిపై దృష్టి సారించకుండా నిర్వహణను గాలికి వదిలేస్తున్నారు. కొన్ని పల్లెప్రకృతి వనాల్లో పశువులు, మేకలు సంచరిస్తున్నాయి. మరికొన్ని వనాల్లో మొక్కలకు నీరు అందకుండా పోయింది. పల్లె ప్రకృతి వనాలను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీలకు అందించిన ట్రాక్టర్లు, నీటి ట్యాంకర్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. అధికారులు మాత్రం ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. ఇప్పటికైనా మండల, జిల్లా శాఖ అధికారుల చొరవతో పల్లె ప్రకృతి వనాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండలవాసులు అభిప్రాయపడుతున్నారు.


ఖైరదట్వాలో కనీసం బోర్డు ఏర్పాటు చేయకుండా ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం

# అధ్వానంగా అంతర్గత రోడ్లు


దిలావర్‌పూర్ నుంచి గుండంపల్లికి వెళ్లే అంతర్గత బీటీ రోడ్డు


న్యాలోలం నుంచి అడెల్లి ఆలయానికి వెళ్లే రోడ్డుపై ఏర్పడిన పెద్దపెద్ద గుంతలు

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 26 : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ నుంచి గుండంపల్లి గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు, గుండంపల్లి నుంచి సముందర్‌పల్లి గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు, నిర్మల్ భైంసా 61 జాతీయ రహదారి అనుకొని సారంగాపూర్ మండలంలోని అడెల్లి ఆలయానికి వెళ్లే అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి, సంవత్సర కాలంగా ఈ రోడ్లకు మరమ్మతులు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి పక్కన ఉన్న లోలం గ్రామ పరిసర ప్రాంతం నుంచి అడెల్లి అమ్మవారి ఆలయానికి వెళ్లే బీటీ రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడినాయి. వర్షకాలం వచ్చిందంటే ఆ గుంతల్లో నీరు నిలిచి అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతి ఆదివారం అమ్మవారి ఆలయానికి మహారాష్ట్ర, ఇతర ప్రాంతం నుంచి అనేక మంది భక్తులు తమ మొక్కులు చెల్లించుకునేందుకు వస్తుంటారు. ఈ సమయంలోనే రోడ్డు భాగు లేక అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇకనైనా అధికారులు, ప్రభుత్వం చొరవ చూపి అంతర్గత రోడ్ల మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

## సామాజిక మాధ్యమాలను మంచి కోసం వినియోగించాలి


బహుమతి అందజేస్తున్న భీం ఆర్మీ అధ్యక్షుడు షేక్ షకీల్

ఎదులాపురం, ఫిబ్రవరి 26 : సామాజిక మాధ్యమాలను మంచి కోసం వినియోగించాలని, వాటిని దుర్వినియోగించడం సరికాదని భీం ఆర్మీ అధ్యక్షుడు షేక్ షకీల్ పేర్కొన్నారు. భీం ఆర్మీ ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భావజాలంపై ఫొటో కాంపిటీషన్ నిర్వహించారు. ఈ పోటీలో గెలుపొందిన విజేత వికాస్ పాటిల్‌కు స్థానిక అంబేద్కర్ భవన్‌లో బుధవారం నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.


వాటర్‌ట్యాంక్ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

## నీటి ట్యాంక్ వద్ద శుభ్రత పట్టదా?

నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని ఇలేగాం గ్రామంలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించకపోవడంతో నీరు పారే అవకాశం లేనందున అపరిశుభ్రత నెలకొంది. ట్యాంకు నీటిని ఇంటి అవసరాలకు వినియోగిస్తున్నందున దోమల వ్యాప్తి పెరిగి వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు ట్యాంకు చుట్టూ పెరిగిన మొక్కలను తొలగించి మురుగు కాలువలను శుభ్ర పరచాలని వారు కోరుతున్నారు.

-భైంసాటౌన్, ఫిబ్రవరి 26


ట్యాంకు దగ్గర మురుగు కాలువలో నిలిచిన నీరు

## మందుబాబులకు అడ్డాగా కళాశాల


కుభీర్: మందుబాబులు తాగి పారేసిన బీరు సీసాలు

కుభీర్, ఫిబ్రవరి 26 : నిర్మల్ జిల్లా కుభీర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ నిర్మించక పోవడంతో రాత్రి అయితే చాలు కళాశాల ప్రాంగణం మందుబాబులకు అడ్డాగా తయారైంది. ప్రహరీ లేక ప్రాంగణంలో పశువులు, మేకలు, గొర్రెల సంచారంతో నాటిన మొక్కలు పెరగడం లేదు. పోకిరీలు, మందుబాబులకు అడ్డాగా మారి కళాశాల ఆవరణలో కాల్చిన సిగరెట్ తునకలు, మందు సీసాలు, పగిలిన బీరు బాటిళ్లతో అధ్వానంగా మారుస్తున్నారు. దీంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు, పార్శిల్ చెత్త, యూజ్ అండ్ త్రో గ్లాసులు, విస్తరాకులు, కాగితాలతో కళాశాల ఆవరణ భయానక వాతావరణాన్ని తలపిస్తోంది. ఎంతో మంది విద్యార్థులకు గాజు పెంకుల కాళ్లకు గుచ్చుకుపోయి అనారోగ్యానికి గురైన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం శ్రద్ధ చూపి ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

# రేషన్ సరుకులు పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ అజీజ్

ఎదులాపురం, ఫిబ్రవరి 26: మానవతా దృక్పథంతో నిరుపేదల సంక్షేమం కోసం సహాయం అందిస్తూ, తన సేవలను మరింత బలోపేతం చేయడానికి ముందుకు సాగుతుందని ఫౌండేషన్ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ అజీజ్ అన్నారు. బుధవారం ఉమీద్ ఫౌండేషన్ పవిత్ర రంజాన్ నెల సందర్భంగా పేద ముస్లిం కుటుంబాలకు రేషన్ సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, అబ్దుల్ అజీజ్, షౌకత్ అలీ, ఖలీల్ అహ్మద్, సలీమ్ మొహియుద్దీన్, అబ్దుల్ రషీద్, మహ్మద్ హమీదుల్లా అన్వర్, నౌషాద్, మహ్మద్ జమీల్, మహ్మద్ షఫియుల్లా, గంగాధర్ రెడ్డి, ముష్తాక్ అహ్మద్ ఫౌండేషన్ బాధ్యతాయుతమైన వ్యక్తులు పాల్గొన్నారు.

## ఎల్విలో పట్టపగలు దొంగతనం

తానూర్,ఫిబ్రవరి, 26 : నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని ఎల్వి గ్రామంలో బుధవారం పట్టపగలు చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అవదూత్‌వార్ పెద్ద లింగం ఇంట్లో మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని దుండగులు ఇంట్లో చొరబడి 3 తులాల బంగారం రూ.50 వేల నగదు దొంగలించినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. నిందితుల గుర్తింపు కోసం డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంలను రప్పించినట్లు ఎస్ఐ తెలిపారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## చికిత్స పొందుతూ ఒకరు మృతి

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 26: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాగూడ(జీ) గ్రామానికి చెందిన ఎక్స్‌రోడ్డు వద్ద ఈ నెల 19వ తేదీన రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన మడావి రాంషావ్ బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం...ఉట్నూర్ మండలానికి చెందిన దేవల్లా శ్రీనివాస్ బైక్‌పై ఉట్నూర్ నుంచి ఆదిలాబాద్ వైపు అజాగ్రత్త, అతివేగంగా నడుపుతూ మండలంలోని కేస్లాగూడ(జీ) గ్రామానికి చెందిన మడావి రాంషావ్ బైక్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో రాంషావ్‌కు తలకు తీవ్ర గాయాలై హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మడావి రాంషావ్ మృతికి కారకుడైన ఉట్నూర్ మండలానికి చెందిన దేవల్లా శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు.

## రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలి


మాట్లాడుతున్న బేస్ బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఫిరంగి అజయ్

ఎదులాపురం, ఫిబ్రవరి 26 : ఆదిలాబాద్ జిల్లా సబ్ జూనియర్ మినీ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీల్లో రాణించాలని బేస్ బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఫిరంగి అజయ్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లోని ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి బేస్ బాల్ సబ్ జూనియర్ మినీ క్రీడాకారుల ఎంపిక కార్యక్రమంలో ఆయన పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో శిక్ష అభియాన్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం బాలబాలికల ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఎంపికైన జట్టు ఈ నెల 27 నుంచి సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో బేస్‌బాల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, హ్యాండ్ బాల్ జిల్లా ప్రధానకార్యదర్శి హరిచరణ్, వ్యాయామ ఉపాధ్యాయులు గౌతమ్, రూపేశ్, విజయ్, ప్రవీణ్, అజయ్, ప్రణయ్ పాల్గొన్నారు.

# హర హర మహాదేవ..


బోథ్: కైలాష్ టేకిడిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్ దంపతులు

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పోటెత్తడంతో శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. ఊరూరా ఓం నమః శివాయ అంటూ శివనామస్మరణతో ఆలయాల ప్రాంగణాలు మారుమ్రోగాయి. భక్తులు శివుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పుష్పార్చనలు చేశారు. లక్ష్మణచాంద మండలం బూరుగుపల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయ సమీపంలోని కోనేరులో, కడెం మండలం బెల్లాల్, బాసరలోని గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. ఆలయాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు అవసరమైన ఏర్పాటు చేశారు. పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహించారు. పూజల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, యువకులు, చిన్నారులు, మహిళలు, తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు. దిలావర్‌పూర్ మండలంలోని కదిలిపాపహరేశ్వర ఆలయంలో నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మలో, బోథ్ మండలం నిగిని అటవీ ప్రాంతంలోని కైలాష్ టేకిడిపై కొలువై ఉన్న నర్మదేశ్వరునికి బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్, జైనథ్ మండలంలోని అడ గ్రామంలోని శివాలయంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఉట్నూర్ మండలంలోని సాలేవాడ(కే) గ్రామంలోని శివాలయంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.

-నమస్తే నెట్‌వర్క్, ఫిబ్రవరి 26


బాసర: గోదావరి నది వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు


ఎదులాపురం: గంగపుత్ర ఆలయం వద్ద బారులు తీరున్న భక్తులు


నేరడిగొండ: సోమేశ్వరున్ని దర్శించుకోవడానికి బారులు తీరిన భక్తులు

## అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత


పట్టుబడిన కలప

కడెం, ఫిబ్రవరి 26 : వడ్ల సంచుల మాటున అక్రమంగా తరలిస్తున్న కలపను అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. బుధవారం నిర్మల్ జిల్లా కడెం మండలంలోని గంగాపూర్ అటవీ ప్రాంతం నుంచి ట్రాక్టర్‌లో టేకు ఫర్నిచర్, సోఫా, బెడ్స్, డ్రెస్సింగ్ టేబుల్, డైనింగ్ టేబుల్ విడి భాగాలను ట్రాక్టర్ కింద వేసి, పైనుంచి వడ్ల సంచులు వేసుకొని అటవీ ప్రాంతం గుండా వెళ్తున్న వాహనాన్ని పక్క సమాచారంతో అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. వాహనాన్ని, కలపను కడెం రేంజ్ కార్యాలయానికి తరలించారు. పట్టుకున్న కలప విలువ రూ. 40 వేల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. వాహనాన్ని పట్టుకున్న ఎఫ్ఎస్వో కింగ్‌ఫిషర్‌ను ఎఫ్ఆర్వో గీతారాణి అభినందించారు. వాహనాన్ని సీజ్ చేసి, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

## కుంటాల జలపాతం వద్ద వైద్య శిబిరం

నేరడిగొండ, ఫిబ్రవరి 26 : ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని కుంటాల జలపాతం వద్ద స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జలపాతం వద్ద కొలువైన సోమేశ్వరుడి దర్శించుకోవడానికి ప్రతి ఏటా భక్తులు వస్తారు .కొంతమంది అనారోగ్యంతో ఉన్న వారికి మందులు అందజేసినట్లు హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ తెలిపారు. హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ఆశకార్యకర్త రమాదేవి పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా పాఠశాల పరిసరాలు



లక్ష్మణచాంద ప్రాథమిక పాఠశాల

నిర్మల్‌అర్బన్, ఫిబ్రవరి 26: నిర్మల్ జిల్లా లక్ష్మణచాందలోని ప్రాథమిక పాఠశాల పరిసరాలు ప్రమాదకరంగా తయారయ్యాయి. పాఠశాల తరగతి గది పక్కన చేపడుతున్న నూతన గదుల నిర్మాణ పనులు నిలిచిపోవడంతో పక్కన పిచ్చిమొక్కలు ప్రమాదకరంగా తయారయ్యాయి. చిన్నారులు పొరపాటున తరగతి గది పక్కకు వెళ్లినట్లయితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. నిర్మాణ పనుల్లో భాగంగా తీసిన మట్టికుప్పలు, బండరాళ్లు దర్శనమిస్తున్నాయి. బండరాళ్లలో విష జంతువులు ఉంటే పాఠశాలకు వచ్చిన చిన్నారులు ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. పాఠశాలకు వెళ్లగానే మట్టికుప్పలు, పిచ్చిమొక్కలు కనిపిస్తున్న వాటిని తొలగించడానికి పాఠశాల సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది ఆసక్తి చూపడం లేదు. ప్రమాదం జరగకముందే పిచ్చిమొక్కలు, మట్టికుప్పలు, బండరాళ్లు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


తరగతి గది పక్కన ప్రమాదకరంగా పిచ్చి మొక్కలు, బండల కుప్ప

## బంగారు గొలుసు చోరీ


ముథోల్, ఫిబ్రవరి 26 : నిర్మల్ జిల్లా ముథోల్‌లోని బోడ వాడకట్టులో గల బైపాస్ రోడ్డులోని హనుమాన్ ఆలయం వద్ద ఇంటి బయట బీడీలు చేసుకుంటున్న సుంకరి సుప్రియ మెడలో నుంచి గురు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి ఫోన్ మాట్లాడినట్లు చేసి మూడు తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లినట్లు ఎస్ఐ సంజీవ్ తెలిపారు. సంఘటన స్థలాన్ని సీఐ మల్లేశ్‌తో పాటు ఎస్ఐ పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత


సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లతో ఎస్ఐ దివ్య భారతి, సిబ్బంది

బేల, ఫిబ్రవరి 26 : ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని కంగార్‌పూర్ నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లు పట్టుబడ్డాయని ఎస్ఐ దివ్య భారతి తెలిపారు. సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆమె వెంట ఏఎస్ఐ జీవన్, సిబ్బంది ఉన్నారు.

## నిర్లక్ష్యానికి.... నిలువెత్తు నిదర్శనం


కుభీర్‌లోని ప్రధాన రహదారిలో ఇళ్లల్లోకి చేరిన మురుగు నీరు

కుభీర్, ఫిబ్రవరి 26: నిర్మల్ జిల్లా కుభీర్‌లోని బస్టాండు నుంచి పోలీస్ స్టేషన్ వెళ్లే ప్రధాన రహదారికి ఎడమ పక్కన ప్రధాన మురుగు కాలువలో చెత్త కూరుకు పోయి ఎక్కడికక్కడ మురుగు నీరు నిలిచి పోయి దుర్గంధం వెదజల్లుతోంది. మేదరి గల్లీ, హోటళ్లు, మెకానిక్ షాపులు, పెద్ద మజీద్, ప్రభుత్వ దవాఖాన, వెల్డింగ్ దుకాణాలు ఇరుపక్కల ఉన్నాయి. ఇదే రహదారి వెంబడి ప్రతి గురువారం సంత కొనసాగుతుంది. ఈ రోడ్డు వెంబడి ఉన్న ఇళ్లల్లోకి మురుగు నీరు వెళ్తున్నాయి. పుప్పాల గల్లీ లోపలికి వెళ్లే మార్గంలో మురుగు కాలువపై వేసిన చిన్న బ్రిడ్జి కూలి పోవడంతో ఇండ్లల్లోకి మురుగు నీరు ప్రవేశిస్తోంది. నెలలు గడిచి పోతున్నా పంచాయతీ కార్యదర్శికి ఎన్ని మార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఈ కాలనీ వాసులు అంటున్నారు. ఈవిషయమై ఎంపీఓ మోహన్‌సింగ్‌ను వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శికి చెప్పి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.


పెద్ద మజీద్ ముందు బాగంలో దుర్గంధం వెదజల్లుతున్న ప్రధాన మురుగు కాలువ

## అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత


పట్టుబడిన మద్యం సీసాలు

బోథ్, ఫిబ్రవరి 26 : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జుల్ఫీకర్ అహ్మద్ తెలిపారు.. మహారాష్ట్ర వైపు నుంచి ఇద్దరు వ్యక్తులు మంగళవారం రాత్రి మద్యం సీసాలను ద్విచక్రవాహనంపై తరలిస్తుండగా చెక్‌పోస్టు వద్ద సిబ్బంది వాటిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. పట్టుబడిన మద్యం విలువ రూ.14,400 వరకు ఉంటుందని సీఐ తెలిపారు. మద్యం పట్టుకున్న వారిలో ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

## వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

కడెం, ఫిబ్రవరి 26 : నిర్మల్ జిల్లా కడెం మండలంలోని పాతమద్దిపడగ గ్రామానికి చెందిన బాతేం నర్సయ్య(67) వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం...బాతేం నర్సయ్య మద్యానికి బానిసై ఇంట్లో తాగుడుకు డబ్బులు ఇవ్వడం లేదని క్షణికావేశంలో గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బావిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీసి శవ పంచానామా నిమిత్తం ఖానాపూర్‌కు తరలించి, అనంతరం మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ చెప్పారు. నర్సయ్య భార్య ఫిర్యాదు మేరకు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### మద్యానికి బానిసై ..

తలమడుగు, ఫిబ్రవరి 26 : మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రుయ్యాడి గ్రామానికి చెందిన జువ్వాక పవన్‌కుమార్(27) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిస అయ్యాడు. జీవితం విరక్తి చెంది గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి నర్సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వ్యక్తి అదృశం

ఎదులాపురం, ఫిబ్రవరి 26: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడకు చెందిన అన్నెల లక్ష్మణ్(50) అనారోగ్యంతో ఈ నెల 21వ తేదీన జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో చేరాడు. బుధవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో తన భార్యను నెట్టివేసి దవాఖాన నుంచి బయటకు వెళ్లిపోయాడు. సాయంత్రం వరకు కూడా తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మదన్ తెలిపారు.